సాక్షి
పెద్దపల్లి
గురువారం । 26 । సెప్టెంబర్ । 2024

సీతమ్మ జడల మురిపెం

మరికొద్ది రోజుల్లోనే బతుకమ్మ పండుగ రాబోతోంది. ఇప్పటికే బొడ్డెమ్మ వేడుకలు ప్రారంభమయ్యాయి. ఇక వచ్చేది తమ పండుగే అంటూ జట్టుకుచ్చులు(సీతమ్మ జడలు) మురిసిపోతున్నట్లు ఈ దృశ్యం కనిపిస్తోంది. బంతి, చేమంతి, తంగేడు, గునుగ తదితర పూలు బతుకమ్మ పండుగ కోసం ముస్తాబవుతున్నాయి. ఆయా ప్రాంతాల్లోని రైతులు తమ పంట చేలలో వీటిని పెంచుతున్నారు. పెద్దపల్లి మండలం కొత్తపల్లి శివారులోని పట్టుకుచ్చుల పంట 'సాక్షి' కెమెరాకు ఇలా అందంగా కనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



న్యూస్‌రీల్

అవగాహనతో ప్రాణాపాయానికి చెక్



ర్యాలీలో డాక్టర్లు, మెడికోలు

కోల్‌సిటీ(రామగుండం): వ్యాధులపై అవగాహన కలిగి ఉంటే ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చని గోదావరిఖనిలోని సిమ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందుసింగ్ అన్నారు. 'ప్రపంచ రోగుల సురక్షిత వారం' సందర్భంగా జీజీహెచ్, సిమ్స్ ప్రొఫెసర్లు, హెచ్‌వోడీలు, ఆర్‌ఎంవోలు, మెడికోలు బుధవారం నగరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, సరైన సమయంలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించడంతోపాటు వైద్యులను సంప్రదిస్తే సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందుతాయన్నారు. తద్వారా ప్రాణాపాయం తప్పుతుందని తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ నరేందర్, ప్రొఫెసర్లు అనంతబాబు, ఒబులేశు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కార్మికుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

పెద్దపల్లిరూరల్: మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యంరావు ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం నెలకు రూ.26 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. పెద్దపల్లి మున్సిపల్ కార్మికులకు ఏడాదిగా బట్టలు, చెప్పులు, నూనె తదితర వస్తువులు ఇవ్వడం లేదని ఆరోపించారు. రామగుండం, కరీంనగర్ కార్పొరేషన్లలోని కార్మికులకు ఒకపూట పనికల్పించాలని డిమాండ్ చేశారు. నాయకులు మహేశ్, వెంకటస్వామి, సాగర్, చంద్రయ్య, అన్వేష్, సతీశ్, నాగమణి, సారయ్య, కిషన్‌నాయక్, సురేశ్, లక్ష్మణ్, రాధాకిషన్, చందు, గట్టయ్య, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో పనిచేయాలి



మాట్లాడుతున్న డీపీవో వీరబుచ్చయ్య

మంథని: గ్రామ పంచాయతీ కార్యదర్శులు చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలని జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులతో బుధవారం ఆయన సమీక్షించారు. గ్రామాల్లో పారిశుధ్య లోపం తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పచ్చదనం పెంపునకు నాటిన మొక్కలను సంరక్షించాలని ఆదేశించారు. పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని సూచించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై యాప్ ద్వారా సర్వే చేయాలని, కరెంట్ బిల్లులు, పంచాయతీ వర్కర్ల మల్టీపర్పస్ సిబ్బంది వేతనాలు చెల్లించాలని అన్నారు. డీఎల్‌పీవో సతీశ్‌కుమార్, ఎస్‌బీఎం కో ఆర్డినేటర్‌లు రాఘవులు, రేణుక, ఎంపీడీవో పూర్ణచందర్‌రావు పాల్గొన్నారు.

రేపు 'డయల్ యువర్ జీఎం'

గోదావరిఖని: ఆర్జీ–1 ఏరియాలో పనిచేస్తున్న ఉద్యోగులు, వారి కుటుంబాల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 27న డయల్‌యువర్ జీఎం కార్యక్రమం నిర్వహిస్తామని జీఎం లలిత్‌కుమార్ బుధవారం తెలిపారు. శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి సాయంత్రం 5గంటల మధ్య 08728- 244112 నంబరుకు ఫోన్‌చేసి తమ సమస్యలు వివరించాలని ఆయన సూచించారు.

సెలవుల పొడిగింపు

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శ్రీకాంత్ ఈనెల 27వ తేదీ వరకు సెలవులు పొడిగించుకున్నారు. ఈనెల 19 నుంచి ఈనెల 24వ తేదీ వరకు సెలవుపై వెళ్లిన కమిషనర్.. బుధవారం విధుల్లో చేరాల్సి ఉంది. కానీ, ఈనెల 27వ వరకు సెలవులు పొడిగించుకున్నారు. ప్రస్తుతం అదనపు కలెక్టర్ అరుణశ్రీ ఎఫ్ఏసీ కమిషనర్‌గా పూర్తిబాధ్యతలు నిర్వహిస్తున్నారు.

బాధ్యతలు స్వీకరణ

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థ రెవెన్యూ ఆఫీసర్(ఆర్‌వో)గా ఇ.ఆంజనేయులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కరీంనగర్ నగరపాలక సంస్థలో సీనియర్ అసిస్టెంట్ అయిన ఆంజనేయులు ఇప్పటివరకు ఇన్‌చార్జి ఆర్‌వోగా విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం డిప్యూటేషన్‌పై రామగుండం చేరుకుని విధుల్లో చేరారు. తర్వాత మేయర్ అనిల్‌కుమార్‌ను ఆయన కలిశారు.

'స్థానికం' గెలవండి.. టికెట్ పొందండి!

- ప్రతీచోట విజయం సాధించాలి
- ఉమ్మడి జిల్లా నేతలకు కాంగ్రెస్ పెద్దల స్పష్టీకరణ
- కరీంనగర్ సీపీ, సిరిసిల్ల ఎస్పీలపై పీసీసీ చీఫ్‌కు ఎమ్మెల్యేల ఫిర్యాదు
- సమావేశ జాబితాలో పేరు లేకపోవడంపై అలిగిన జీవన్‌రెడ్డి
- రుణమాఫీ, రేషన్‌కార్డుల ప్రక్రియ వేగిరం చేయాలన్న 'అడ్లూరి'
- కార్పొరేషన్లను గెలుస్తామని మంత్రులు దుద్దిళ్ల, పొన్నం ధీమా
- వరుస పర్యటనలకు మంత్రుల కసరత్తు!



ఇటీవల ఉమ్మడి జిల్లా నేతలతో సమావేశమైన దీపాదాస్ మున్షీ, మహేశ్‌కుమార్ గౌడ్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రతీచోట పార్టీ విజయం సాధించాలని.. అలాగైతేనే మరోసారి టికెట్ దక్కుతుందని కాంగ్రెస్ పెద్దలు స్పష్టం చేశారు. దీంతో కరీంనగర్ ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ నేతలందరూ వారం రోజులుగా ఆ దిశగా పని చేస్తున్నారు. గత వారం హైదరాబాద్‌లో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ నేతృత్వంలో ఉమ్మడి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, కంటెస్టెడ్ ఎమ్మెల్యేలు, ఎంపీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చకు వచ్చిన పలు అంశాలు జిల్లా రాజకీయాల్లో ఆసక్తి రేకెత్తిస్తున్నాయి. ముఖ్యంగా పోలీసు, రెవెన్యూ, ఇతర విభాగాల్లో పనిచేసే కీలక అధికారులను మార్చాలని, వారు తమకు సహకరించడం లేదని పలువురు ఎమ్మెల్యేలు ఫిర్యాదులు చేయడంపై ఆయా డిపార్ట్‌మెంట్లలో జోరుగా చర్చ జరుగుతోంది.

సీపీ, ఎస్పీలను మార్చాల్సిందే..

విశ్వసనీయ సమాచారం ప్రకారం.. కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతి, సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్‌లను మార్చాల్సిందేనని ఎమ్మెల్యేలు పట్టుబట్టారు. మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మరోసారి కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతి విషయాన్ని లేవనెత్తారు. ఆయన ఏమాత్రం సహకరించడం లేదని, వెంటనే తప్పించాలని పీసీసీ చీఫ్‌కు ఫిర్యాదు చేశారు. ఇటీవల సీపీపై కవ్వంపల్లి చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. అదే సమయంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సీపీ మహంతి పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేయడం గమనార్హం. ఇక, సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్‌పై ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయం బయటకు రావడంతో రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో చర్చనీయాంశమైంది. హోంశాఖ సీఎం రేవంత్‌రెడ్డి వద్దే ఉండటంతో ఏ నిర్ణయం తీసుకుంటారోనన్న ఉత్కంఠ నెలకొంది.

- బీఆర్ఎస్ హయాంలో జగిత్యాల జిల్లాలో నియమితులైన పలువురు అధికారులు ఎమ్మెల్యేలకు ఏమాత్రం సహకరించడం లేదని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆరోపించారు. రుణమాఫీ, రేషన్‌కార్డుల ప్రక్రియ వేగిరం చేయాలని కోరారు.
- ప్రభుత్వం చేస్తున్న అనేక పనులను మరింత సమర్థంగా చెప్పుకోవాల్సిన అవసరం ఉందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అభిప్రాయపడ్డారు.

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కినుక..

ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి సమావేశానికి హాజరయ్యారు. ప్రస్తుతం కరీంనగర్ నుంచి పట్టభద్రుల స్థానానికి ఎమ్మెల్సీగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కానీ, ఆయన పేరు సమావేశ జాబితాలో లేకపోవడంతో బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేశారు. పొరపాటును గుర్తించిన పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్.. వెంటనే జీవన్‌రెడ్డికి సర్ది చెప్పారు. ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన నేపథ్యంలో ఆయన పేరు నిజామాబాద్ జిల్లాలో ఉందని తెలిపారు. ఈ సమావేశానికి జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ హాజరవడంపైనా జీవన్‌రెడ్డి కినుక వహించారని సమాచారం. ఈ రెండు విషయాల్లో ఎమ్మెల్సీ, ఆయన అనుచరులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.

ఇక మంత్రుల వరుస పర్యటనలు!

ఈ సమావేశానికి హాజరైన మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లు స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయబావుటా ఎగురవేస్తుందని చెప్పారు. రామగుండం, కరీంనగర్ కార్పొరేషన్లను కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. అదే సమయంలో ఇన్‌చార్జి మంత్రి ప్రతీ నెల రివ్యూలు చేపట్టాలని, 15 రోజులకోసారి ఏదైనా నియోజకవర్గంలో పర్యటించాలని పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ సూచించారు. దీంతో ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులతోపాటు ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్ని నియోజకవర్గాల్లో వరుస పర్యటనలకు కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది.

మహిళా సాధికారతే లక్ష్యం

- రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్
- బల్దియాలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభం



క్యాంటీన్ నిర్వాహకులను అభినందిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

కోల్‌సిటీ(రామగుండం): మహిళా సాధికారత లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను మేయర్ బంగి అనిల్‌కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. క్యాంటీన్ ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి విజయారాణి క్యాంటీన్ నిర్వాహకులు, 17వ డివిజన్‌కు చెందిన సంతోషి మాత స్లమ్ లెవెల్ ఫెడరేషన్ సభ్యులు సుహాసిని, దీపిక, రాధను ఎమ్మెల్యే అభినందించారు. వారిని ఆదర్శంగా తీసుకొని స్వయం ఉపాధి పొందడానికి యూనిట్లు స్థాపించాలని మహిళలకు సూచించారు. మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని ఆకాంక్షిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి అత్యధిక నిధులు కేటాయించి ప్రోత్సాహకాలు అందిస్తున్నారని తెలిపారు. అందులో భాగంగానే ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే వివరించారు. మహిళా సంఘాలకు రూ.50 లక్షల వరకు బ్యాంక్ లింకేజీ మంజూరు కావడానికి కృషి చేసిన సీఎల్‌ఆర్‌పీ కవితను ఎమ్మెల్యే అభినందించారు. కార్పొరేటర్లు మహంకాళి స్వామి, బొంతల రాజేశ్, నాయకులు పాతపెల్లి ఎల్లయ్య, పెద్దెల్లి ప్రకాశ్, నగరపాలక అసిస్టెంట్ కమిషనర్ రాజలింగు, ఈఈ రామన్, డీఈలు జమీల్, హన్మంతు నాయక్, ఆర్ఐ శంకర్‌రావు, మెప్మా టీఎంసీ ఊర్మిళ, సీవోలు శ్వేత, స్వరూప, స్వప్న, సీఎల్‌ఆర్‌పీ కవిత పాల్గొన్నారు.

అకాడతో ఆత్మవిశ్వాసం

జ్యోతినగర్(రామగుండం): విద్యార్థులు అకాడ నేర్చుకోవడం ద్వారా ఆత్మవిశ్వాసం పెరుగుతుందని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. అన్నపూర్ణకాలనీలోని ప్రైవేట్ హైస్కూల్ విద్యార్థులకు శ్రీహనుమాన్ అకాడ శిక్షణను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విశ్వభారతి విద్యా సంస్థల చైర్మన్ బందారపు యాదగిరిగౌడ్, అకాడ మాస్టర్, నిర్వాహకుడు కంది నాగరాజు, కంది చంద్రయ్య, ఆంజనేయులు, సాగర్, సాయిరాం, రణధీర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మహంకాళి స్వామి, పెండ్యాల మహేశ్, ముచ్చకుర్తి రమేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ కోణంలో దర్యాప్తు అవసరం

- డ్యూటీ మీట్‌తో వృత్తి నైపుణ్యం వృద్ధి
- రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్



శునకాల ప్రదర్శనను పరిశీలిస్తున్న పోలీసు కమిషనర్ శ్రీనివాస్, ఏసీపీ రాఘవేంద్రరావు

గోదావరిఖని: కేసులను శాస్త్రీయ కోణంలో ఛేదించాలని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ సూచించారు. కమిషనరేట్‌లో బుధవారం నిర్వహించిన పోలీస్ డ్యూటీ మీట్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చట్టాల అమలు, అంతర్గత భద్రత, నేరాలను శాస్త్రీయంగా గుర్తించడం, దర్యాప్తు చేయడం ద్వారా శాస్త్రీయ ఆధారాలతో సామర్థ్యం మెరుగుపరచుకోవచ్చని అన్నారు. రాష్ట్రంలో తొలిసారి తెలంగాణ స్టేట్ పోలీస్ డ్యూటీ మీట్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల పోలీస్ సిబ్బందికి వివిధ అంశాలల్లో శాస్త్రీయపరమైన పరీక్షలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచి వారిని అక్టోబర్ 4న చేపట్టే కాళేశ్వరం జోన్ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌కు ఎంపిక చేయనున్నారు. జోన్‌స్థాయి పోటీల్లో ఎంపికయ్యే వారిని రాష్ట్ర డ్యూటీ మీట్‌కు ఎంపిక చేయనున్నట్లు సీపీ వెల్లడించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ(అడ్మిన్) రాజు, స్పెషల్ బ్రాంచ్, గోదావరిఖని, సీసీఎస్, టాస్క్‌ఫోర్స్, ఏఆర్ ఏసీపీలు రాఘవేంద్రరావు, రమేశ్, వెంకటస్వామి, మల్లారెడ్డి, ప్రతాప్, సురేంద్ర, ఆర్ఐలు దామోదర్, వామనమూర్తి, సంపత్, మల్లేశం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాజీపడితే ఇద్దరూ గెలిచినట్లే..

రాజీపడితే ఇద్దరూ గెలిచినట్లేనని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈక్రమంలో ఈనెల 28న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పోలీస్ అధికారులు, కోర్టు డ్యూటీ కానిస్టేబుల్లు, సిబ్బంది.. రాజీకి అవకాశం ఉండే కేసులను గుర్తించి ఇరువర్గాల వారికి కౌన్సెలింగ్ చేయాలని పోలీస్ కమిషనర్ సూచించారు.

జిల్లా ఆస్పత్రిలో 150 పడకలు

- ఆస్పత్రిని ఆధునికీకరిస్తాం
- దవాఖానాలో సౌకర్యాలు కల్పిస్తాం
- చిన్నారుల కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటు
- కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఎమ్మెల్యే విజయరమణారావు
- పోలీస్ ఔవుపోస్టు, కంటి, దంత విభాగాలు ప్రారంభం



యంత్ర పరికరాల గురించి వివరిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష, చిత్రంలో ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: హోదాకు తగిన విధంగా జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో పడకల సామర్థ్యాన్ని 50 నుంచి 150కి పెంచి, ఆధునికీకరిస్తాని కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. గర్భిణులకు అన్నిరకాల వైద్యసేవలు, స్కానింగ్ ఉచితంగా అందిస్తున్నామన్నారు. జిల్లా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన నేత్ర శస్త్రచికిత్స, ఆర్థోపెడిక్, డెంటల్ పరికరాలు, చిన్నారులకు ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగాన్ని వారు బుధవారం ప్రారంభించి మాట్లాడారు. మాతా శిశు కేంద్రంలో గర్భిణుల కోసం టిఫా స్కానింగ్ సేవలు అందుబాటులోకి తెచ్చామన్నారు. డెంటల్ కావిటీ ఫిల్లింగ్, రూట్ కెనాల్, సర్జరీల సదుపాయం కల్పించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యసేవలు మరింతగా మెరుగ్గా, నాణ్యంగా అందించేందుకు కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని ఎమ్మెల్యే ప్రశంసించారు.

అందుబాటులో అన్నిరకాల వైద్యం

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ, మాతాశిశు ఆస్పత్రుల్లో అన్నిరకాల వైద్యసేవలను అందుబాటులోకి తెచ్చామని, జిల్లావాసులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఎమ్మెల్యే విజయరమణారావు కోరారు. ఓపీ సేవలతోపాటు డయాగ్నొస్టిక్ హబ్ ద్వారా రక్తపరీక్షలు నిర్వహిస్తున్నారని వారు తెలిపారు. సీజనల్ వ్యాధుల బారినపడ్డ వారికి నాణ్యమైన సేవలు అందించారని వివరించారు. మాతాశిశు ఆస్పత్రిలో పేయింగ్ రూంలు ఏసీ సౌకర్యంతో అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీధర్, డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, ఆర్‌ఎంవో రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమిస్తేనే హక్కులు సాధ్యం

- నవంబర్ 23, 24న జిల్లా మహాసభలు
- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు భూపాల్



మాట్లాడుతున్న భూపాల్

జ్యోతినగర్(రామగుండం): కార్మికుల శ్రేయస్సు, హక్కుల సాధనకు ఉద్యమించాల్సిందేనని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు భూపాల్ కోరారు. ఎన్టీపీసీ ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్డులో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రప్రభుత్వం ప్రజా సమస్యలు విస్మరించి, మతోన్మాద ఎజెండా అమలు చేస్తోందని, తద్వారా ప్రజలను విభజించి పాలిస్తోందని ఆరోపించారు. కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను సవరించి బానిసలుగా మార్చే ప్రయత్నాలు చేస్తోందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా చేపట్టిన పోరాటాలకు అండగా ఉంటున్న సీపీఎం జిల్లా మహాసభలు నవంబర్ 23, 24వ తేదీల్లో ఎన్టీపీసీ జ్యోతినగర్‌లో నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు.

ఆహ్వాన కమిటీ నియామకం..

సీపీఎం జిల్లా మూడో మహాసభల ఆహ్వాన కమిటీని కార్యదర్శివర్గ సభ్యుడు ఎ.ముత్యంరావు, కార్యదర్శి వై.యాకయ్య ప్రకటించారు. మహాసభల ఆహ్వాన కమిటీ గౌరవ అధ్యక్షుడిగా వై.యాకయ్య, అధ్యక్షుడిగా నాంసాని శంకర్, ప్రధాన కార్యదర్శిగా ఎం.రామాచారి, కోశాధికారిగా భిక్షపతిని నియమించారు. కార్యక్రమంలో నాయకులు రామాచారి, మహేశ్వరి, కుమార్‌స్వామి, శంకర్, గీట్ల లక్ష్మారెడ్డి, జ్యోతి, రవీందర్, అశోక్, భిక్షపతి, శైలజ, నర్సింగరావు, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

పండుగకు పస్తులేనా?

- దసరా బోనస్‌పై స్పష్టత కరువు
- బల్దియా కార్మికుల్లో ఆందోళన



అప్పటి ఇన్‌చార్జి కమిషనర్ శివానంద్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్మికులు(ఫైల్)

కోల్‌సిటీ(రామగుండం): దసరా పండుగ అడ్వాన్స్‌పై బల్దియా అధికారులు ఇంకా స్పష్టత ఇవ్వలేదు. దీంతో రామగుండం నగరపాలక సంస్థలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, తాత్కాలిక ఉద్యోగులు, వారి కుటుంబాలు ఆందోళనకు గురవుతున్నాయి. దసరా అడ్వాన్స్ కోసం ఇటీవల అధికారులకు వినతిపత్రాలు కూడా సమర్పించారు. ఏటా దసరా పండుగకు ముందే అడ్వాన్స్ చెల్లించే అధికారులు.. ఈసారి ఇంకా ఎలాంటి నిర్ణయం వెలువరించకపోవడం విస్మయానికి గురిచేస్తోంది.

పదేళ్లుగా ఏటా చెల్లింపులు..

రామగుండం బల్దియాలో 448 మంది పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారు. కార్యాలయంతోపాటు వాటర్ సెక్షన్, ఎలక్ట్రికల్, రెవెన్యూ తదితర విభాగాల్లో మరో 122 మంది తాత్కాలిక ఉద్యోగులు పనిచేస్తున్నారు. తొలి మేయర్‌గా పని చేసిన కొంకటి లక్ష్మీనారాయణ తొలుత దసరా అడ్వాన్స్ కింద కార్మికులకు రూ.5వేల చొప్పున చెల్లించారు. ఆ సొమ్ము సరిపోవడం లేదని కార్మికులు, కార్మిక సంఘాల నాయకుల విజ్ఞప్తి మేరకు దానిని రూ.10వేలకు పెంచారు. ఇలా కార్మికులకు చెల్లించిన అడ్వాన్స్‌ను.. ప్రతీనెల రూ.వెయ్యి చొప్పున వారి వేతనంలో రికవరీ చేస్తూ వస్తున్నారు.

నిధుల కొరతతో..

నాలుగేళ్లుగా బల్దియా నిధుల కొరతతో సతమతమవుతోంది. ఈక్రమంలోనే దసరా అడ్వాన్స్ చెల్లించేందుకు పాలకవర్గం, అధికారులు ముందుకు రావడం లేదు. 570 మంది కార్మికులకు సుమారు రూ.57లక్షలు అవసరం ఉంటుందని అధికారులు అంచనా వేశారు. అంతసొమ్ము వెచ్చించలే పరిస్థితుల్లో లేమని వారు చేతులెత్తేస్తున్నారు. గతడాది 448 మంది పారిశుధ్య కార్మికులు తమమ సొసైటీలో జమచేసుకున్న సొమ్ములోంచే ఒక్కొక్కరు రూ.5 వేలు అడ్వాన్స్‌గా తీసుకున్నారు. మిగతా కార్మికులకు పండుగకు పైసా అందలేదు. దీంతో వారి కుటుంబాలు నిరుత్సాహంతో ఉండిపోయాయి. ఈ ఏడాది కూడా దసరా అడ్వాన్స్ చెల్లించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. కానీ ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించకపోవడంతో కార్మికులు అయోమయానికి గురవుతున్నారు.

అడ్వాన్స్ ఇస్తేనే పండుగ



రోజంతా పారిశుధ్య పనులు చేసుకునే మాకు ప్రతినెలా రూ.14,560 వేతనం చేతికి అందుతుంది. ప్రస్తుతం పెరిగిన నిత్యావసరాల ధరలు, వైద్యచికిత్సల ఖర్చులు, పిల్లల చదువులకే ఇది సరిపోవడం లేదు. ఇక దసరా పండుగ ఎలా జరుపుకునేది? అడ్వాన్స్ ఇస్తే కొంత ఆసరాగా ఉంటుంది. పిల్లలకు కొత్త బట్టలు కొనవచ్చు. అధికారులు ఈ దిశగా ఆలోచన చేయాలి.

– నాగమణి, పారిశుధ్య కార్మికురాలు

సొసైటీ నుంచి ఇవ్వండి



మున్సిపల్‌లో నిధులు లేకపోతే కనీసం మా సొసైటీ నుంచైనా రూ.10వేలు దసరా అడ్వాన్స్ ఇప్పించండి. పండుగను ప్రతీ కార్మిక కుటుంబం సంబురంగా జరుపుకోవాలి. పాలకవర్గం, అధికారులు స్పందించి అడ్వాన్స్ ఇప్పించడానికి చర్యలు తీసుకోవాలి. మా కార్మిక కుటుంబాల సంతోషం కోసం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ జోక్యం చేసుకోవాలి.

– కిషన్‌నాయక్, ట్రాక్టర్ డ్రైవర్

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తా



పారిశుధ్య కార్మికులతోపాటు ఇతర విభాగాల్లో పనిచేసే ఉద్యోగులకు దసరా అడ్వాన్స్ కొండంత అండగా ఉంటుంది. కార్మికులు, ఉద్యోగులు చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నారు. ఆ సొమ్ముతో నెలవారీ ఖర్చులకే ఇబ్బంది పడుతున్నారు. పండుగలు వస్తే వారి పరిస్థితి అధ్వానంగా ఉంటోంది. అడ్వాన్స్ చెల్లిస్తే వారికి కొంత ఆసరాగా ఉంటుంది. ఇందుకోసం బల్దియా రూ.5వేలు, సొసైటీ నుంచి రూ.5వేలు కలిపి మొత్తం రూ.10వేల చొప్పున చెల్లించాలి. సమస్యను కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్తాం.

– నడిపెల్లి మురళీధర్‌రావు, అధ్యక్షుడు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్

క్లుప్తంగా

ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటుకు సహకరించండి



ఎంపీ వంశీకృష్ణతో కలిసి పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు శ్రీనివాస్, భాస్కర్, సంతోష్, సందీప్, సదయ్య

పెద్దపల్లిరూరల్: స్వరాష్ట్ర సాధనకోసం పనిచేసిన ఉద్యమకారుల సంక్షేమం కోసం ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేసేందుకు సహకారం అందించాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు గుండేటి ఐలయ్య కోరారు. మంథని నుంచి వస్తున్న ఎంపీ వంశీకృష్ణను బుధవారం శాంతినగర్‌లో కలిసి తమ సమస్యలను విన్నవించారు. ఈనెల 27న తమ సంఘం ఆరో ఆవిర్భావ దినోత్సవం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ఉత్సవ ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. వేడుకలకు హాజరు కావాలని ఎంపీని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, భాస్కర్, సంతోష్, సందీప్, సదయ్య, సదాశివ్, రవి, కనకయ్య, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో ఐదో విడత ప్రవేశాలు

రామగుండం: పట్టణంలోని ఇండస్ట్రియల్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్ (ఐటీఐ)లో నాలుగు విడతల్లో భర్తీకాని సీట్లలో ప్రవేశాల కోసంచివరి అవకాశంగా ఐదో విడతలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ సురేందర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదో విడతలో ఐటీఐలో ప్రవేశాల కోసం విద్యార్థులు ఈనెల 28వ తేదీలోగా దరఖాస్తు చేయాలన్నారు. ఇందుకోసం htpp://iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో తమ పూర్తివివరాలను నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు బీఎంఎస్ ధర్నా



మాట్లాడుతున్న సత్తయ్య

గోదావరిఖని: సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం సింగరేణి వ్యాప్తంగా అన్ని జీఎం కార్యాలయాల ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య కోరారు. జీడీకే–2ఏ గనిపై బుధవారం ఏర్పాటు చేసిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్‌లో జరిగిన రూ.వెయ్యి కోట్ల కుంభకోణంపై సీబీఐ ద్వారా విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సింగరేణి సాధించిన వాస్తవ లాభాలపై 33శాతం వాటా కార్మికులకు అందజేయాలని డిమాండ్ చేశారు. నాయకులు సారంగపాణి, కర్రావుల మహేశ్, మాదాసి రవీందర్, తాట్ల లక్ష్మయ్య, సంగాని సాంబయ్య పాల్గొన్నారు.

3 క్వింటాళ్ల కాపర్‌వైర్ చోరీ

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): శాస్త్రీనగర్‌లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతు(రిపేర్)చేసే సెంటర్‌లో దాదాపు రూ.లక్ష విలువైన కాపర్‌వైర్ చోరీకి గురైంది. ఈ దొంగతనం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై శ్రావణ్‌కుమార్ కథనం ప్రకారం.. కొందరు దొంగలు సోమవారం రాత్రి శాస్త్రీనగర్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ రిపేర్ కేంద్రం వద్దకు వచ్చారు. కిటికీల్లోంచి లోపలికి చొరబడి సీసీ కెమెరాలు ధ్వంసం చేశారు. దాదాపు మూడు క్వింటాళ్ల కాపర్‌వైర్ అపహరించుకు వెళ్లారు. దాని విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని బాధితుడు తెలిపాడు. బాధితుడు నరేందర్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొన్నట్లు ఎస్సై వివరించారు.

గర్భిణులకు మెరుగైన వైద్యం

- జీజీహెచ్‌కు ప్రసూతి ఇంటెన్సివ్ కేర్ యూనిట్
- శిథిలమైన సిబ్బంది నివాసాల రెనోవేషన్‌కు చర్యలు
- అందులోనే టీబీ కేర్ యూనిట్ ఏర్పాటు చేయండి
- అధికారులను ఆదేశించిన కలెక్టర్ కోయ శ్రీహర్ష



ఆస్పత్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష, సిమ్స్ ప్రిన్సిపాల్ హిమబిందుసింగ్

కోల్‌సిటీ(రామగుండం): గర్భిణులకు మెరుగైన వైద్యం అందించేందుకు గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)కి ప్రసూతి ఇంటెన్సివ్ కేర్ యూనిట్ మంజూరైందని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. దీని ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బుధవారం జీజీహెచ్‌ను కలెక్టర్ సందర్శించారు. ఐసీయూ, పోస్ట్ ఆపరేటివ్ వార్డు రినోవేషన్ పనులను పరిశీలించారు. అనంతరం ఆస్పత్రి నిర్వహణపై సమీక్షించారు. వైద్యులతో సమావేశమయ్యారు. పేషెంట్లకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన అంశాల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి సిబ్బందికి కేటాయించిన పాత క్వార్టర్లను రెనోవేషన్ చేసి టీబీ, కేర్ సెంటర్ ఏర్పాటు చేయాలని సూచించారు. జీజీహెచ్‌లోని రెండు బ్లాకుల మధ్య రోడ్డు, లైటింగ్ సౌకర్యం కల్పించాలన్నారు. దీనికి సంబంధించిన ప్రతిపాదనలు అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఆస్పత్రిలో తరచూ విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అయితే, ప్రత్యేక ఫీడర్ లైన్ ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సిమ్స్ నిర్వహణపై ఆరా తీసిన కలెక్టర్.. పలు సూచనలు చేశారు. ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే పేషెంట్లకు మెరుగైన వసతులతో సేవలు అందించాలని ఆదేశించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ దయాల్‌సింగ్, సిమ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందు సింగ్‌తోపాటు ప్రొఫెసర్లు, హెచ్‌వోడీలు, ఆర్ఎంవోలు తదితరులు పాల్గొన్నారు.

హాలీవుడ్‌లో మనోడి సినిమా

- వృత్తి అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం.. ప్రవృత్తి నటన
- స్వతహాగా 'ది డిజర్వింగ్' మూవీ తీసిన కరీంనగర్ యువకుడు
- కథ, స్క్రీన్‌ప్లే, నిర్మాత, హీరో అతనే..
- ట్రైలర్‌తోనే 28 ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫేర్ అవార్డులు
- 128 దేశాల్లో వచ్చే నెల 1న విడుదల



నటీనటులతో వెంకట్‌సాయి



సినిమా పోస్టర్



ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో అవార్డుతో..

కరీంనగర్ అర్బన్: సినిమా.. అదో రంగుల ప్రపంచం. అద్భుతంగా తెరకెక్కిస్తే సందేశమేదైనా చేరువ చేసే సాధనం. ఇక, సినిమా తీయాలంటే సాంకేతిక విభాగం, నటీనటులు, ప్రొడక్షన్, డైరెక్షన్ ఇలా ఎన్నెన్నో.. ఆపై హీరోనే నిర్మాతగా, ఫిల్మ్ మేకర్‌గా, కథా రచయితగా రాణించాలంటే కఠోర శ్రమ అవసరం. కానీ, అనుకుంటే కానిది ఏదీ లేదని కరీంనగర్ భగత్‌నగర్‌లోని శ్రీరామకాలనీకి చెందిన గుండ వెంకట్‌సాయి నిరూపించాడు. వృత్తి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం, ప్రవృత్తి నటనగా ముందుకెళ్తూ నిరంతర శ్రమతో సఫలీకృతుడయ్యాడు. 31 ఏళ్ల వయసులోనే ఏకంగా హాలీవుడ్‌లో సినిమా నిర్మించి, ట్రైలర్‌తోనే 28 ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫేర్ అవార్డులు సాధించాడు.

11 ఏళ్ల క్రితం అమెరికాకు..

వెంకట్‌సాయి బీటెక్ పూర్తి చేసి, ఎంఎస్ చదివేందుకు 11 ఏళ్ల క్రితం అమెరికా వెళ్లాడు. తన భార్య ప్రత్యూషతో కలిసి న్యూజెర్సీలో ఉంటున్నాడు. అతనికి మొదటి నుంచి ఫొటోగ్రఫీ, నటనపై మక్కువ. తల్లిదండ్రులు గుండ సునీత–శ్రీనివాస్ వెన్నుతట్టి ప్రోత్సహించారు. ఈ క్రమంలో అమెరికా వెళ్లినా, ఆరంకెల వేతనం వస్తున్నా వెంకట్‌సాయి ఫొటోగ్రఫీ, నటనను వదలలేదు. హాలీవుడ్‌లోనే సినిమా తీయాలి.. తెలుగువాడి సత్తా చాటాలన్న ఆలోచనతో విరామ సమయాల్లో వెబ్‌సిరీస్, ఫొటోగ్రఫీ చేసేవాడు. 'వద్దంటే వస్తావే ప్రేమ' 10 ఎపిసోడ్స్ తీసి, ప్రత్యేక గుర్తింపు పొందాడు. బెస్ట్ ఫొటోగ్రాఫర్‌గా అనేక అవార్డులు పొందాడు.

14 రోజుల్లోనే సినిమా తీశాడు..

తప్పు చేసి, పశ్చాత్తపపడే ఇతివృత్తంతో ది డిజర్వింగ్ సినిమా నిర్మించాడు వెంకట్‌సాయి. చిన్నప్పటి నుంచి ఇంగ్లిష్ మూవీస్ చూసే అలవాటు ఉండటంతో తదనుగుణ నటీనటులను ఆడిషన్స్ నిర్వహించి, ఎంపిక చేశాడు. అందరూ అమెరికన్‌లే. గంట పదిహేడు నిమిషాల నిడివి గల ఈ సినిమాను 14 రోజుల్లోనే తీయడం విశేషం. హారర్, థ్రిల్లర్, సైకాలజికల్, ఎమోషనల్ సమ్మిళితమైన మూవీ ఇది. సాయిసుకుమార్, అరోరా(డైరెక్టర్), ఇస్మాయిల్, సీమోన్‌స్టార్లర్, కేసీస్టార్లర్, ప్రియ(మోడల్), మారియంలు సినిమా నిర్మాణంలో ఎంతో సహకరించారని వెంకట్‌సాయి తెలిపాడు. అక్టోబర్ 1న 128 దేశాల్లో సినిమా విడుదల కానుందని పేర్కొన్నాడు.

సినిమా కోసం చాలా కష్టపడ్డాను



ది డిజర్వింగ్ సినిమా తీసేందుకు ఐదేళ్లు పట్టింది. కథ రాయడం నుంచి సినిమా పూర్తయ్యే వరకు చాలా కష్టపడ్డాను. టాలీవుడ్‌లో ఎన్నైనా టేక్‌లు తీసుకోవచ్చు. హాలీవుడ్‌లో అలా కాదు.. డబ్బింగ్ ఉండదు. నటులు ఇచ్చిన షెడ్యూల్ ప్రకారమే పూర్తి చేయాలి. వాయిదా పడితే మళ్లీ ఏళ్లు పడుతుంది. చిన్నతనంలో తాతయ్య, నాన్న కథలు చెప్పేవారు. ఇంగ్లిష్ సినిమాలు ఎక్కువ చూసేవాణ్ని. ఇంగ్లిష్‌వారికి నచ్చేలా మన కథనే కొంత మార్పు చేశా. సినిమా నిర్మాణంలో నా భార్య ప్రత్యూష సహకారం మరువలేను. టీం అంతా ఒక స్నేహపూర్వక వాతావరణంలో సినిమా చేశాం. తెలుగు వ్యక్తిగా త్వరలోనే టాలీవుడ్‌లో నటిస్తా.

– గుండ వెంకట్‌సాయి

ప్రపంచస్థాయిలో గుర్తింపు




నా కొడుకు వెంకట్‌సాయికి చిన్నప్పటి నుంచి సినిమాలంటే పిచ్చి. ఎక్కువగా ఇంగ్లిష్ మూవీస్ చూసేవాడు. కెమెరా పట్టుకొని, ఫొటోలు తీస్తూ తన సరదా తీర్చుకునేవాడు. మేము ఏనాడూ తన ఇష్టాలను కాదనలేదు. అమెరికా వెళ్తానంటే పంపించాం. అక్కడ ఉద్యోగం చేస్తూనే ప్రపంచం మెచ్చే స్థాయిలో సినిమా తీస్తాడని కలలో కూడా ఊహించలేదు. గ్రేట్‌రా సాయి.

– గుండ శ్రీనివాస్, వెంకట్‌సాయి తండ్రి

ఇంజినీర్లు సృజనాత్మకంగా ఆలోచించాలి

- అంతరిక్ష మాజీ శాస్త్రవేత్త డాక్టర్ టీపీ శశికుమార్



మాట్లాడుతున్న డాక్టర్ శశికుమార్

తిమ్మాపూర్(మానకొండూర్): ఇంజినీర్లు సృజనాత్మకంగా ఆలోచించాలని అంతరిక్ష మాజీ శాస్త్రవేత్త డాక్టర్ టీపీ.శశికుమార్ అన్నారు. తిమ్మాపూర్ మండల కేంద్రంలోని జ్యోతిష్మతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్(అటానమస్) కళాశాలలో 'రేపటి ఇంజినీర్లు–డ్రీమ్స్, డిజైన్ అండ్ డెలివర్' అనే అంశంపై బుధవారం సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఇంజినీరింగ్‌కు సంబంధించిన అన్ని విభాగాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అకాడమిక్ విద్యకే పరిమితం కాకుండా టెక్నికల్, సాఫ్ట్ అండ్ కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్చుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. వారి సందేహాలు నివృత్తి చేశారు. ఎంవోవోసీ వంటి ఆన్‌లైన్ కోర్సుల్లో చేరాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు, సెక్రటరీ, కరస్పాండెంట్ సుమిత్‌సాయి, ప్రిన్సిపాల్ కేఎస్.రావు, అకాడమిక్ డీన్ పీకే.వైశాలి, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

దొంగలకు గంజాయి విక్రయించిన వ్యక్తి అరెస్ట్



నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

మెట్‌పల్లి: దొంగలకు గంజాయి విక్రయించిన ఘటనలో పట్టణ శివారులోని అర్బన్ హౌసింగ్ కాలనీకి చెందిన చందు అనే యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ నిరంజన్‌రెడ్డి కథనం ప్రకారం.. ఈ నెల 21న అర్ధరాత్రి సమయంలో బండలింగాపూర్ క్రాసింగ్ వద్ద మక్కజొన్నల లోడ్‌తో వెళ్తున్న ఓ వ్యాన్‌ను ముగ్గురు వ్యక్తులు ఆపి డ్రైవర్‌ను కొట్టారు. అతడి నుంచి సెల్‌ఫోన్‌తోపాటు రూ.5వేల నగదును ఎత్తుకెళ్లారు. డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. ఈనెల 23న ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. ఆ సమయంలో వారి వద్ద ఉన్న గంజాయి గురించి ప్రశ్నించగా.. దానిని చందు వద్ద కొనుగోలు చేసినట్లు చెప్పారు. అప్పటినుంచి పరారీలో ఉన్న చందు బుధవారం ఇంటికి వచ్చాడనే సమాచారంతో అక్కడకు వెళ్లి అరెస్ట్ చేశారు. అతని నుంచి 350 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. చందును పట్టుకున్న ఎస్సైలు అనిల్, చిరంజీవి, రాజు, ఇతర సిబ్బందిని సీఐ అభినందించారు.

హత్య కేసులో ఇద్దరికి జైలు

సిరిసిల్లకల్చరల్: హత్య కేసులో ఇద్దరికి జైలు శిక్ష విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.ప్రేమలత బుధవారం తీర్పునిచ్చారు. ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపిన వివరాల ప్రకారం.. ముస్తాబాద్ మండలానికి చెందిన పండుగ రాజంకు తన సోదరి పండుగ మరియమ్మకు ఆస్తి పంపకాల్లో తగదా ఏర్పడింది. మరియమ్మ, ఆమె కుమారుడు మల్లేశం ఇద్దరూ కలిసి రాజంను హత్య చేసేందుకు 2020 సెప్టెంబర్ 1న ప్రణాళిక వేసుకొని గొడ్డలితో నరికి చంపారు. ఈ ఘటనపై అప్పటి సిరిసిల్ల రూరల్ సీఐ సర్వర్ కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు. కేసు పూర్వాపరాల పరిశీలన తర్వాత నేరం రుజువైన కారణంగా మల్లేశంకు జీవిత ఖైదు, మరియమ్మకు పదేళ్ల కారాగార శిక్ష, చెరో రూ.2,500 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

రాష్ట్ర దేవాలయ ఉద్యోగుల జేఏసీ కార్యవర్గం ఎన్నిక

వేములవాడ: రాజన్న సిరిసిల్ల జిల్లా ములవాడ పట్టణంలో బుధవారం జరిగిన రాష్ట్ర దేవాదాయ ఉద్యోగుల జేఏసీ సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వివరాలను ముఖ్య అతిథులు వెల్లడించారు. జేఏసీ గౌరవ అధ్యక్షులుగా మారం జగదీశ్వర్, చైర్మన్‌గా గజవెల్లి రమేశ్‌బాబు, డిప్యూటీ చైర్మన్లుగా బుద్ధి శ్రీనివాస్, ఆర్.సుదర్శన్, చంద్రశేఖర్, గౌరవ సలహాదారులుగా జె.దయాకర్‌రెడ్డి, డి.భాస్కర్, సాయి, ఎస్.హరికిషన్, జె.కృష్ణ, ఉమేష్‌శర్మ, వరినర్సయ్య, ఎస్. శ్రీరాములు, కె.వెంకటాచార్యులు, టి.కపేంద్రాచారి, గట్టు మదన్‌కుమార్, వైస్ చైర్మన్‌గా మల్లికార్జున్, కె.నిరంజన్, ప్రధాన కార్యదర్శిగా రంగారావు, సహాయ కార్యదర్శులుగా సువర్ణ రాధాకిషన్, గట్టు శ్రవణ్‌కుమార్, మంద స్వామి, సునీల్ కుమార్, నవీన్‌శర్మ, ఎడ్ల శివసాయి, కార్యదర్శులుగా గంగా శ్రీనివాస్, కిరణ్‌కుమార్, కోశాధికారిగా సురేంద్రాచార్యులు, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా శ్రీధరశర్మ, గోలి శ్రీనివాస్, ప్రచార కార్యదర్శులుగా కట్కూరి వెంకటయ్య, నాగుల మహేశ్, మాధవాచార్యులు, క్రీడల కార్యదర్శిగా శ్రీనివాస్‌లతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ వేతనాలు

- కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ జనక్‌ప్రసాద్



మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్

గోదావరిఖని: కోలిండియా తరహాలో సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు హైపర్ వేతనాలు అందించేందుకు కృషి చేస్తున్నామని కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ జనక్‌ప్రసాద్ అన్నారు. బుధవారం రాత్రి స్థానిక జనక్‌భవన్‌లో ఏర్పాటు చేసిన కాంట్రాక్టు కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుమారు 103 ఏళ్ల సింగరేణి చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా కాంగ్రెస్ ప్రజాపాలనలో కాంట్రాక్ట్ కార్మికులకు రూ.5వేలు బోనస్ చెల్లించడం చరిత్రాత్మక నిర్ణయమన్నారు. రామగుండంలో ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మిస్తారని వెల్లడించారు. కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల సాధన కోసం త్వరలోనే పూర్తిస్థాయి కాంట్రాక్ట్ కార్మికుల సంఘాన్ని ఏర్పాటు చేసి పోరాటం చేస్తామన్నారు. రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ అయిన రోజు ఉంచి తెలంగాణ వ్యాప్తంగా ఉన్న కోటి ఇరవై లక్షల మంది కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల కోసం అంతర్జాతీయ సంస్థ (ఐఎల్‌వో)తో రెండు సమావేశాలు నిర్వహించామని తెలిపారు. దీనిద్వారా వారికి శాస్త్రీయపరంగా వేతన సవరణ జరుగుతుందని అన్నారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంతిర భట్టి విక్రమార్క, ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ధర్మపురి, సదానందం, కాంపెల్లి సమ్మయ్య, జెట్టి శంకర్‌రావు, కలవేన శ్యామ్, లక్ష్మీపతిగౌడ్, వికాస్ కుమార్‌యాదవ్, శేషరత్నం, దాస్, ఎండీ అక్రం, అక్బర్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సంఘాలు బెదిరిస్తే భయపడేదిలేదు

- టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాంమూర్తి



మాట్లాడుతున్న రాంమూర్తి

గోదావరిఖని: బెదిరింపులకు భయపడి కార్మికుల పక్షాన పోరాటం ఆపేది లేదని టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రాంమూర్తి స్పష్టం చేశారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము చేసే ఆందోళన కొన్ని కార్మిక సంఘాల దృష్టిలో నేరమవుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. కార్మికులకు న్యాయమైన వాటా దక్కాలని పోరాడుతున్న టీబీజీకేఎస్ నాయకుల అంతు చూస్తామని బెదిరింపులకు దిగడం సరికాదన్నారు. కార్మికుల పక్షాన పోరాడేటమే నేరమై, హత్య చేస్తామన్నా కూడా భయపడేది లేదని స్పష్టం చేశారు. నల్లనేలకు తిరుగుబాటు గుణం ఉందని, బెదిరింపులు, ఉడుత ఊపులకు టీబీజీకేఎస్ బయపడదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా సింగరేణి సాధించిన నికర లాభాలపై 33శాతం వాటాగా రూ.1,551కోట్లను కార్మికులకు పంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఐఎన్‌టీయూసీ నాయకులు అసత్య ఆరోపణలను, వ్యక్తిగత దూషణలకు దిగడం వారి ఆధిపత్య ధోరణికి నిదర్శనమన్నారు. సమావేశంలో నాయకులు చల్ల రవీందర్‌రెడ్డి, పోలాడి శ్రీనివాసరావు, వాసర్ల జోసఫ్, నూతి రాజ్‌కుమార్, పులిపాక శంకర్, మహిపతిరావు, అడ్డగట్ల గోపి తదితరులు పాల్గొన్నారు.

లాభాల్లో 33శాతం వాటా చెల్లించాలి

- ఆర్జీ–1 జీఎం ఆఫీస్ ఎదుట టీబీజీకేఎస్ నాయకుల ధర్నా



వినతిపత్రం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే చందర్, టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి

గోదావరిఖని: సింగరేణి యాజమాన్యం సాధించిన వాస్తవ లాభాల్లో 33శాతం వాటా కార్మికులకు చెల్లించాలని కోరుతూ బుధవారం ఆర్జీ–1 జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్మికులను మోసం చేస్తే కోల్‌బెల్ట్ ఎమ్మెల్యేలే బాధ్యత వహించాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి హెచ్చరించారు. కార్మికులకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని, బెదిరింపులు భయపడబోమని తేల్చి చెప్పారు. కార్యక్రమంలో నాయకులు వడ్డేపల్లి శంకర్, మాదాసి రామమూర్తి, పర్లపల్లి రవి, ఎల్.వెంకటేశ్, ప్రవీణ్, చెలుకలపల్లి శ్రీనివాస్, ముదుంపల్లి రాజేశం, ఇందూరి సత్యనారాయణ, వాసర్ల జోసెఫ్, దూట శేషగిరి, బొగ్గుల సాయి, ఉప్పులేటి తిరుపతి, కొంద్ర అంజయ్య, జనగామ మల్లేశ్, దిడ్డి లక్ష్మణ్, వెంకటరెడ్డి, అభిషేక్, కార్పొరేటర్లు కృష్ణవేణి, గాదం విజయ, సంధ్యారెడ్డి, శ్రావణ్, చింటూ, రొడ్డ సంపత్, సట్టు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కవర్లలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

- కొత్తపల్లి బ్రిడ్జి కింద లభ్యం
- పోస్టుమార్టం చేసినట్లు ఆనవాళ్లు
- వలస కూలీగా అనుమానిస్తున్న పోలీసులు



కవర్లలో ప్యాక్ చేసిన మృతదేహం

తిమ్మాపూర్(మానకొండూర్): కవర్లలో కట్టిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమవడం.. పోస్టుమార్టం చేసినట్లు ఆనవాళ్లు ఉండటం కలకలం రేపింది. ఎల్ఎండీ ఎస్సై వివేక్ తెలిపిన వివరాల ప్రకారం.. చిగురుమామిడి మండలంలోని చిన్న ముల్కనూర్‌కు చెందిన ఓ మత్స్యకారుడు బుధవారం చేపలు పట్టేందుకు తిమ్మాపూర్ మండలంలోని కొత్తపల్లి బ్రిడ్జి కింద నీటిలో దిగాడు. కొంత దూరం నుంచి ప్యాక్ చేసినట్లు ఉన్న ఏదో కొట్టుకురావడం అతనికి కనిపించింది. వెంటనే 100కు కాల్ చేశాడు. ఎస్సై వివేక్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. కవర్లను విప్పి, చూడగా ఓ వ్యక్తి మృతదేహం ఉంది. ఒంటిపై ఎలాంటి దుస్తులు లేవని, నీలం, తెలుపు రంగు కవర్లలో మృతదేహాన్ని ప్యాక్ చేశారని ఎస్సై తెలిపారు. మృతుడి వయసు 45 నుంచి 50 ఏళ్ల మధ్య ఉంటుందన్నారు. కొత్తపల్లి పంచాయతీ కార్యదర్శి అనిల్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పలు అనుమానాలు..

రెండు, మూడు రోజుల క్రితం మృతదేహాన్ని మోయతుమ్మెద వాగులో పడేసినట్లు పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. చనిపోయిన వ్యక్తికి పోస్టుమార్టం నిర్వహించిన ఆనవాళ్లు ఉన్నాయి. మృతుడు బిహార్ లేదా మరో రాష్ట్రం నుంచి కూలీ కోసం వచ్చిన వ్యక్తిగా అనుమానిస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని ఎల్ఎండీలో పడేసి ఉంటారా, అంత్యక్రియలకు డబ్బులు లేక వదిలేశారా, లేదా ఎవరైనా కావాలనే వాగులో పడేశారా అని పోలీసులు అనుమానిస్తున్నారు. సంఘటన స్థలం వద్దే మృతదేహానికి మరోసారి పోస్టుమార్టం నిర్వహించి, కరీంనగర్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రశాంతంగా బాలుడి దహన సంస్కారాలు

- జగ్గాసాగర్‌లో సద్దుమనిగిన వివాదం
- మృతుడి తల్లిపై దాడి ఘటనలో పలువురిపై కేసు



మృతుడి తండ్రితో మాట్లాడుతున్న పోలీస్ అధికారులు

మెట్‌పల్లిరూరల్: తల్లి మందలించడంతో ఈనెల 8న ఆత్మహత్యకు పాల్పడి.. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందిన మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్‌కు చెందిన ఏనుగు ప్రభాస్ (19) దహన సంస్కారాలను బుధవారం కుటుంబసభ్యులు పూర్తిచేశారు. నివాసముంటున్న ఇల్లు, నాలుగెకరాల వ్యవసాయ భూమి తల్లి పేరుపై ఉండడంతో బదలాయింపు జరిగాకే అంత్యక్రియలు చేస్తామని కుటుంబసభ్యులు, కులస్తులు తేల్చి చెప్పిన విషయం తెల్సిందే. మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, సీఐ నిరంజన్‌రెడ్డి బాలుడి కుటుంబసభ్యులు, గ్రామస్తులతో మాట్లాడారు. అంత్యక్రియలు పూర్తిచేయాలని, ఏమైనా సమస్యలుంటే తర్వాత చూసుకోవాలని సూచించారు. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం కొన్ని నిబంధనలుంటాయని, 36 గంటలు దాటితే తప్పనిసరిగా దహన సంస్కారాలు పూర్తి చేయాల్సిందేనని స్పష్టం చేశారు. పోలీసుల సూచనలతో కార్యక్రమాలు చేశారు. తనకు అప్పులు ఉన్నాయని, తన భార్య పేరిట ఉన్న ఆస్తులు తన పేరున బదలాయింపు చేయాలని మృతుడి తండ్రి పోలీసులను వేడుకున్నాడు. మరోవైపు మృతుడి తల్లిపై దాడికి పాల్పడిన ఘటనలో పోలీసులు పలువురిపై కేసు నమోదు చేశారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటుచేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మెట్‌పల్లి ఎస్సై–1 చిరంజీవి, ఎస్సై–2 రాజు, ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్, కోరుట్ల ఎస్సై–2 శ్వేత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తల్లి ఉద్యోగం చేయమన్నందుకే..

తన తల్లి ఉద్యోగం చేయాలని మందలించినందుకే తాను ఆత్మహత్య చేసుకున్నట్లు బాలుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా వాంగ్మూలం ఇచ్చాడని డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు క్లారిటీ ఇచ్చారు. దాని ఆధారంగానే ఫిర్యాదు తీసుకొని కేసు నమోదు చేశామని స్పష్టం చేశారు. అందులో ఎలాంటి అనుమానాలకూ తావులేదన్నారు.